సాక్షి తిరుపతి

సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



భక్తసంద్రం.. ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తీశ్వరాలయాని భక్తులు ఆదివారం పోటెత్తారు. రాహు కేతు పూజలకు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

- 8లో



ప్రాథమిక వైద్యం.. రాత్రివేళ దూరం

వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రిపూట వైద్య సేవలు ఆగిపోయాయి.

- 8లో



నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలు

తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం డ్రోన్ కెమెరాలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రారంభించారు.

- 8లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి పీజీ పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలోని పీజీ కళాశాలల్లో సైన్స్ గ్రూప్‌ల కోర్సులకు మంగళవారం నుంచి నాలుగో సెమిస్టర్ నిర్వహించనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పరీక్షలకు ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే ఆర్ట్స్, కామర్స్ అండ్ కంప్యూటర్ పీజీ కోర్సుల పరీక్షల షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు వివరించారు.

కేజీబీవీ విద్యార్థినికి సన్‌షైన్ అవార్డు



లహరి

దొరవారిసత్రం : మండలంలోని కేజీబీవీలో సీనియర్ ఇంటర్ విద్యార్థిని నక్కబోయిన లహరి పీఎస్‌టీటీ (ఫెసిలిటేషన్ టీచర్ ట్రైనింగ్) గ్రూపులో 969 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచి సన్‌షైన్ స్టార్స్ అవార్డుకు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ పార్వతి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన మంత్రి చేతుల మీదు అవార్డు అందుకోనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బీఎన్ కండ్రిగ మండలం పార్లపల్లెకు చెందిన నక్కబోయిన ఆనందయ్య, బుజ్జమ్మ దంపతుల కుమార్తె లహరి సన్‌షైన్ అవార్డుకు ఎంపిక కావడంపై ప్రిన్సిపల్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తులు



వసంత బాయి, పీడీ, ఐసీడీఎస్

తిరుపతి అర్బన్ : ఐసీడీఎస్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత ప్రాజెక్టు డైరెక్టర్ వసంత బాయి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఒన్ స్టాప్ సెంటర్ స్కీమ్ ద్వారా పారామెడికల్ సిబ్బంది, మల్టీపర్పస్ స్టాఫ్, కుక్, సెక్యూరిటీ గార్డు, నైట్ గార్డు తదితర ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. రూ.13వేల నుంచి రూ.19వేల వరకు వేతనాలు ఉంటాయన్నారు. అలాగే మిషన్ వాత్సల్య స్కీమ్‌లో ఒప్పంద ప్రాతిపదికన ట్రీ ఆపరేటర్, సోషల్ వర్కర్, డేటా అనలిస్ట్ తదితర ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఎంపికైన వారికి వేతనం రూ.7944 నుంటి రూ.18,536 వరకు ఉంటుందని చెప్పారు. ఆసక్తిగలవారు దరఖాస్తును ఈ నెల 15 నుంచి 30వ తేదీ సాయంత్రం 5.30 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వివరించారు. 18ఏళ్ల నుంచి 42ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌లోని బి-బ్లాక్ ఐదో అంతస్తులోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలోని 506 గదిలో దరఖాస్తులు అందించవచ్చని, లేదా పోస్టు ద్వారా పంపవచ్చని తెలిపారు. ఓసీ అభ్యర్థులు రూ.250, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.200 డీడీ కట్టాల్సి ఉంటుందని వివరించారు. వివరాలకు తిరుపతి.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విరామం..విలాపం



ఒడ్డున నిలిపిన పడవలు

అనంత సాగరంలో గంగపుత్రులు బతుకు పోరు సాగిస్తుంటారు. కుటుంబ పోషణ కోసం ప్రాణాలకు తెగిస్తుంటారు. రాత్రింబవళ్లు వేట సాగించి పొట్టపోసుకుంటారు. సముద్రంలో తెప్ప కదిలితే కానీ కడుపు నిండని పరిస్థితుల్లో నిత్యం కెరటాలకు ఎదురీదుతుంటారు. ఈ క్రమంలోనే ఏటా చేపల వేటకు ప్రభుత్వం విరామం ప్రకటిస్తుంది. మత్స్య సంపద అభివృద్ధి కోసం చర్యలు చేపడుతుంది. అయితే నిషేధ సమయంలో జాలర్ల జీవనానికి చేయూతనందించడంపై శీతకన్ను వేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో గంగపుత్రులకు 'భరోసా' ఉండేది. కూటమి సర్కారు వచ్చిన తర్వాత వేట విరామం మాత్రమే అమలవుతోంది. మత్స్యకారులకు ఆంక్షలు మిగిలి.. ఆర్థిక సాయం దూరమైపోయింది. దీంతో రెక్కాడితే కానీ.. డొక్కాడని బడుగుల బతుకుల్లో అంధకారం నిండుతోంది.

రేపటి నుంచి సాగరంలో వేట బంద్

- 61 రోజుల వరకు సముద్రంలో చేపలు పట్టడంపై నిషేధం
- గత ఆరు నెలలుగా కానరాని మత్స్యసంపద
- కష్టతరంగా మారిన గంగపుత్రుల జీవనం
- ఇప్పటికే రెండు పర్యాయాలు అందని ప్రభుత్వ 'భరోసా'
- సర్కారు తీరుపై ఆందోళనలో మత్స్యకారులు

వాకాడు : సముద్రంలో వేట నిషేధ సమయం రానే వచ్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి వేటకు లంగరు పడనుంది. ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మొత్తం 61 రోజులపాటు వేటకు విరామ సమయంగా ప్రభుత్వం ప్రకటించింది. ఏటా ఇదే షెడ్యూల్‌లో వేటను నిషేధించి తద్వారా మత్స్య సంపదను పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆంక్షలు విధిస్తుంటాయి. సముద్ర జలాల్లో పడవలు, మెకనైజ్డ్, మోటారు బోట్లు ద్వారా చేపల వేటను నిషేధిస్తూ రాష్ట్ర మత్స్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో సముద్రంలోకి ఎవరూ వేటకు వెళ్లకుండా మత్స్యశాఖ, కోస్టల్ గార్డ్స్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, నేవీ అధికారులతో గస్తీ ఏర్పాటు చేయనున్నారు. ఈ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం పరిహారం అందించాల్సి ఉంటుంది. ఐతే రెండు దఫాలుగా కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఇవ్వాల్సిన పరిహారం ఒక్క పైసా కూడా చెల్లించకపోవడం గమనార్హం.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.35.5 కోట్లు

డాక్టర్ వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద 2019 నుంచి ఏటా వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ముందుగానే రూ. 10 వేలు చొప్పున జీవన భృతిగా అందించారు. అలాగే డీజిల్‌పై సబ్సిడీ, ప్రమాద బీమా, 50 ఏళ్లకే పింఛన్ కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గంగపుత్రులకు రూ.35.5 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేశారు.

అందని పరిహారం

ఎన్నికల సమయంలో కూటమి నేతలు తాము అధికారంలోకి వస్తే ఒక్కో మత్స్యకారుడికి వేట విరామ సమయంలో ఏటా రూ. 20 వేలు పరిహారం కింద ఇస్తామని ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు పర్యాయాలు వేట విరామం వచ్చింది. ఈ రెండు దఫాలు ఒక్కసారి కూడా పరిహారం చెల్లించలేదు. గత ఏడాది మత్స్యకారులకు అందాల్సిన వేట విరామ నగదు నేటికీ అందలేదు. ఇటీవల జరిగిన శాసన మండలి సమావేశంలో కూడా ఈ సారి వేట విరామానికి ముందుగానే మత్స్యకారులకు పరిహారం చెల్లిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. అయినా ఇంత వరకు ఆ ఊసేలేదు. ఫలితంగా ఈ ఏడాది కూడా ఆకలి కష్టాలు తప్పవంటూ మత్స్యకారులు వాపోతున్నారు. అసలే గత ఆరు నెలలుగా సముద్రంలో మత్స్య సంపద దొరక్క మత్స్యకారులు అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ రెండు నెలలపాటు జీవనం ఎలా సాగించాలో తెలియక సతమతమవుతున్నారు. ఏడాది కాలంగా వేట సక్రమంగా సాగక గంగపుత్రులు మెతుకు కరువై బతుకు భారమై విలవిలాడుతున్నారు. మరో వైపు ప్రభుత్వం నుంచి కనీస సాయం కూడా అందట్లేదని వాపోతున్నారు.

జిల్లా సమాచారం

సముద్ర తీరం	79 కిలోమీటర్లు
మత్స్యకార గ్రామాలు	24
గంగపుత్రులు	6,500
అన్ని రకాల బోట్లు	1,083



తూపిలిపాళెం వద్ద బోట్లను ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

తీరంలో లంగరు

జిల్లాలోని చిల్లకూరు, కోట, వాకాడు, తడ, సూళ్లూరుపేట మండలాల్లో సముద్ర తీరం విస్తరించి ఉంది. వేట నిషేధం అమల్లోకి వస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు ముందుగానే తమ బోట్లను తీరానికి తీసుకువచ్చి లంగరు వేస్తున్నారు. ఈ క్రమంలో నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటి వరకు మర బోట్లు, పడవలతో కళ కళలాడిన సముద్ర తీరం బోసిబోతోంది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వేట నిషేధిత సమయంలో మత్స్యకారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏపీ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం సెక్షన్ 4 ప్రకారం శిక్ష తప్పదని స్పష్టం చేస్తున్నారు. ఉల్లంఘించిన వారి బోట్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు జరిమానా విధిస్తామని, ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల రాయితీలు రద్దు చేస్తామని రాష్ట్ర మత్స్యశాఖ ఆదేశాలు సైతం జారీ చేసింది. చేపలు పునరుత్పత్తి సమయంలో మరబోట్లు, యంత్ర పడవలు తిరిగితే మత్స్య సంపద నశించిపోతుందని, అందుకే వేట పూర్తిగా నిలుపుదల చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

పస్తులుండాల్సిందే..



ఈ సారైనా వేట విరామం కాలంలో రావాల్సిన పరిహారం అందుతుందా.. లేదా అనే అనుమానం అందరిలోనూ ఉంది. ఇప్పటికే రెండు దఫాలుగా కూటమి ప్రభుత్వం పైసా చెల్లించలేదు. దీంతో దాదాపు రూ.40వేల చొప్పున మత్స్యకారులందరం నష్టపోయాం. ఇప్పుడైనా సాయం చేసారో లేదో తెలియని పరిస్థితి. దీనిపై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం చేయూతనందించకుంటే పూటగడవక పస్తులుండాల్సిందే. – పోలయ్య, మత్స్యకారుడు, కొండూరుపాళెం



కొండూరుపాళెం వద్ద వేట లేక ఖాళీగా ఉన్న మత్స్యకారులు

కూలీలుగా వెళ్లాల్సివస్తోంది



గత ఎనిమిది నెలుగా వేట లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. మమ్మల్సి ఆదుకోవడంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుంది. వేట విరామ సాయాన్ని రెట్టింపుగా అందిస్తామని నమ్మబలికి ఇంత వరకు పైసా కూడా ఇవ్వలేదు. దీంతో తమ బతుకులు భారంగా మారిపోయాయి. వృత్తిని వదిలిపెట్టి సమీప కంపెనీల్లో కూలీలుగా వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పరిహారం అందించాలి. – సోమయ్య మత్స్యకారుడు, తూపిలిపాళెం

ఎలాంటి ఆదేశాలు రాలేదు



మత్స్యకారులకు చెల్లించాల్సిన వేట విరామం నగదు విషయమై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే మత్స్యకారుల వేట విరామం సాయంపై వివరాలు అందిస్తాం. అయితే చేపల వేటపై నిషేధం అమలవుతున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వెళ్లకూడదు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. – రాజేష్, ఏడీ, మత్స్యశాఖ

ట్రాఫిక్ దిగ్బంధం.. 'మెట్టు' మార్గం!



బారులు తీరిన వాహనాలు

చంద్రగిరి : వరుస సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. ఆదివారం ఉదయం ఈ క్రమంలోనే శ్రీవారి మెట్టుకు వెళ్లే మార్గంలోకి పెద్దసంఖ్యలో భక్తులు వాహనాల్లో తరలిరావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శ్రీవారి మెట్టు నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లేందుకు దగ్గరి దారి కావడంతో ఇటీవల భారీగా భక్తులు ఇక్కడకు వస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం శ్రీవారి మెట్టు నుంచి సుమారు 4 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనాలను క్రమబద్ధీకరించేవారు లేకపోవడంతో భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వారాంతపు రోజుల్లో అయినా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే.. శ్రీవారి మెట్టు నుంచి తిరుమలకు వెళ్లేవారి కోసం టీటీడీ కేవలం 3 వేల టోకెన్లను మాత్రమే జారీ చేస్తోంది.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఎంబీసీ వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 72,923 మంది స్వామివారిని దర్శించుకోగా 35,571 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.33 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది.

ఉచిత ఇసుక ఊసే లేదు!



పెళ్లకూరు మండలంలో అక్రమంగా ఇసుక తవ్వకం

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండో దశ ఉచిత ఇసుక్‌పై ఇప్పటికే కలెక్టరేట్‌లో అధికారులు నాలుగు పర్యాయాలు సమావేశాలు నిర్వహించారు. పది రోజుల్లోనే ఉచిత ఇసుక అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత రెండు వారాల్లో అన్నారు.. మొత్తంగా ఆరు నెలలుగా ఉచిత ఇసుక అందుబాటులోకి వస్తుందని చెబుతూనే ఉన్నారు. ఇదిగో అదిగో అంటూ ఇప్పటికే ఆరుసార్లు వాయిదాలు వేశారు. సమావేశాలు నిర్వహించడం.. ఏదో ఒక తేదీ చెప్పడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిపోయింది. మార్చి 11వ తేదీన కలెక్టరేట్‌లో మీటింగ్ నిర్వహించారు. అదే నెల 15వ తేదీ నుంచి రెండో దశ ఉచిత ఇసుక అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. అయితే మరో నెల గడిచినా ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా సర్కార్ నేతృత్వంలో ఇసుక విక్రయాలు సాగడం లేదు. అంతా ప్రైవేటుగా అక్రమ వ్యాపారాలు మాత్రమే జరుగుతున్నాయి. అయితే వాటిని కట్టడి చేయడానికి మైనింగ్ అధికారులు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పాయింట్లు కనుమరుగు

గత ఏడాది జూలై 8న జిల్లాలో ఇసుక పాలసీని వచ్చింది. అయితే రెండు నెలలకే అది కనుమరుగైంది. ఇసుక లేదంటూ ఆయా అధికారిక రీచ్‌లలో బోర్డులు తిప్పేశారు. ఆ తర్వాత గత ఏడాది అక్టోబర్ నుంచి రెండో దశలో భాగంగా జిల్లాలో గూడూరు వద్ద గూడలి సమీపంలో స్వర్ణముఖి వద్ద ఒక పాయింట్, పెళ్లకూరు మండలంలోని కలవకూరు వద్ద రెండు ఇసుక పాయింట్లు గుర్తించారు. ఈ మూడు పాయింట్లలో 1,37,686 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని వాటిని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పిన అధికారులు వాయిదాలు వేస్తూనే ఉన్నారు. ప్రైవేటుగా కూటమి నేతలు యథేచ్ఛగా ఇసుక వ్యాపారం సాగిస్తూ రూ.కోట్లు పోగేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమార్కులను ప్రశ్నించే వారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతా నిజం.. అడిగితే అబద్ధం!

కలియుగ వైకుంఠనాథుని సన్నిధిలోని టీటీడీ గోశాలలో మృత్యుఘోష భక్తులను ఆవేదనకు గురిచేస్తోంది. పరమ పవిత్రంగా పూజించే గోమాత దుస్థితి హృదయాలను కలచివేస్తోంది. పదుల సంఖ్యలో గోవులు మరణించిన ఘటన కూటమి సర్కారును కుదిపేస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దలందరూ వేర్వేరుగా ప్రెస్‌మీట్‌లు పెట్టేశారు. వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలపై విరుచుకుపడ్డారు. గోవులు మరణించడం నిజం అంటూనే.. భూమన అసత్య ప్రచారం చేస్తున్నారంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. ఒకరికొకరు పొంతన లేకుండా అలవోకగా అబద్ధాలు వల్లించారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి రాష్ట్రమంతా తిప్పిస్తామని బెదిరింపులకు తెగబడ్డారు.

- కూటమి సర్కారును కుదిపేస్తున్న టీటీడీ గోశాల ఘటన
- గోవుల మృతి నిజమేనని మరోసారి ఒప్పుకున్న టీటీడీ చైర్మన్
- 20 నుంచి 22 వరకు మరణించాయన్న బీఆర్ నాయుడు
- 40 మృత్యువాత పడినట్లు ఎమ్మెల్యే ఆరణి వెల్లడి
- వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన భూమనకు బెదిరింపులు
- కేసులు పెట్టి రాష్ట్రమంతా తిప్పుతామని హెచ్చరికలు



గోశాలను పరిశీలిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : టీటీడీ గోశాలలో గోవుల మృతి కూటమి ప్రభుత్వానికి ఇబ్బందికంగా మారింది. అమరావతి నుంచి వచ్చిన ఆదేశాలతో తిరుపతిలో ఆదివారం కూటమి నేతల హడావుడి కనిపించింది. ఎవరికి వారు విలేకరుల సమావేశం నిర్వహించి వైఎస్సార్‌సీపీ నేతలపై విమర్శలు గుప్పించారు. టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పినవన్నీ అసత్యాలు అంటూనే.. ప్రస్తుత టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గోవులు మృతి చెందడం వాస్తవమేనని ఒప్పుకున్నారు. అయితే వందకుపై చిలుకు కాదని, 40 అని ఎమ్మెల్యే, 20 నుంచి 22 వరకు అని టీటీడీ చైర్మన్ వెల్లడించడం గమనార్హం. ఎస్వీ గోశాలలో గోమాతలు మృత్యువాత పడుతున్నాయని టీటీడీ మాజీ చైరర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆధారాలతో బయటపెట్టిన విషయం తెలిసిందే. దీంతో కూటమి సర్కారు ఉలిక్కిపడింది. ఏం చేయాలో దిక్కుతోచక.. భూమన ఆరోపణలను టీటీడీ కొట్టిపారేసినా.. నిజం దాగదని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రకటనలతో నిరూపితమైంది. వృద్ధాప్యం, వివిధ కారణాలతో గోవులు మృతి చెందడం సర్వసాధారణమని బీఆర్ నాయుడు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆరణి మాత్రం.. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ×ఎస్వీ గోశాలలో 40 గోవులు మృతి చెందాయని వెల్లడించారు. అయితే అవన్నీ అనారోగ్యంతో మరణించాయని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆదివారం తాజాగా టీటీడీ బోర్డు చైర్మన్, సభ్యుడితోపాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా 20 నుంచి 22 వరకు మృతి చెంది ఉండొచ్చని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మరోసారి స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా 'ఇంట్లో మనుషులు చనిపోరా? గోశాలలో ఆవులు వృద్ధాప్యంతో మరణించి ఉంటాయి'అంటూ చెప్పుకొచ్చారు. గోవు కళేబరాల ఫొటోలు చూపిస్తూ ఇవన్నీ మార్ఫింగ్ అని, ఎక్కడో మృతి చెందినవి అంటూ కొట్టిపారేసే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే.. టీటీడీ గోశాలలో ఉండాల్సిన డాక్టర్ల కంటే తక్కువగా ఉన్నారని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు.. మామూలుగా ఇక్కడ ఆరుగురు డాక్టర్లు ఉండాలని, ప్రస్తుతం ఒకరు పరారీలో ఉన్నారని, మరొకరు ఏదో కారణంతో రాలేదని టీటీడీ చైర్మన్ మీడియా సమక్షంలోనే ఒప్పుకున్నారు.

ప్రశ్నించే గొంతుకను నొక్కేసే కుట్ర

టీటీడీ గోశాలలో గోవులు మృతి చెందుతున్నాయని భూమన కరుణాకరరెడ్డి వెల్లడించిన వాస్తవాలపై ఎల్లో మీడియా ప్రతినిధులు ×భూమనపై కేసులు నమోదు చేస్తారా? అంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని పదే పదే ప్రశ్నించారు. ఎల్లో మీడియా ఒత్తిడి మేరకు భూమన కరుణాకరరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బీఆర్ నాయుడు ప్రకటించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా కేసులు నమోదుచేస్తామని, ఇప్పటికే కొందరు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారంటూ పరోక్షంగా పోసాని కృష్ణమురళిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. టీటీడీపై అసత్య ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ఈ మేరకు రాబోయే బోర్డు సమావేశంలో తీర్మానం కూడా చేస్తామని భాను ప్రకాష్‌రెడ్డి ప్రకటించడం గమనార్హం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీపై ఇష్టారాజ్యంగా అసత్య ప్రచారాలు చేసిన ఇదే నాయకులు నేడు ఇలా మాట్లాడుతుండడంపై తిరుమల, తిరుపతి వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు.

విజయవంతంగా 5కే రన్



జెండా ఊపి పరుగును ప్రారంభిస్తున్న డీన్ మూర్తి

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ సౌత్ క్యాంపస్‌లో ఆదివారం విజయవంతంగా 5కే రన్ నిర్వహించారు. ఐఐటీ విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎస్ఎస్ మూర్తి జెండా ఊపి పరుగును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో సంపూర్ణ ఆరోగ్యానికి మించిన అపార సంపద లేదని తెలిపారు. ఆహారం, పని ఒత్తిడి కారణంగా ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. నాణ్యమైన సమతుల ఆహారం తీసుకుంటూ, ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని అధిగమించాలని కోరారు. ఈ క్రమంలో 5కే రన్ పూర్తి చేసిన మొదటి ఐదుగురికి నగదు బహుమతులు అందించారు. 6 నుంచి 25 స్థానాల్లో నిలిచిన వారికి పతకాలు పంపిణీ చేశారు. రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అడ్వైజర్ ఉదయకుమార్ సుకుమార్, స్పోర్ట్స్ ఆఫీసర్ అయ్యప్పన్, పీటీఐ శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తసంద్రం.. ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వరుసగా సెలవులు రావడంతో ముక్కంటి సన్నిధి భక్తసంద్రంగా మారింది. ఆదివారం సుమారు 5,723 మంది రాహు, కేతు దోష నివారణ పూజలను చేసుకున్నట్టు అలయ అధికారులు ప్రకటించారు. 8,626 మంది రూ.50 రూ.200 దర్శన టికెట్లు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. దాదాపు, 618 మంది రూ.500 టికెట్లతో అంత్రాలయ దర్శనం చేసుకున్నట్లు వివరించారు. మొత్తం 25వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలియజేశారు.

ఫార్మా ఎగ్జిక్యూటివ్స్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎంపికైన నూతన కార్యవర్గం

తిరుపతి తుడా: ఆంధ్రప్రదేశ్ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశం స్థానిక యూత్ హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించిన కార్యవర్గ సభ్యులు 2025 సంవత్సరానికి తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కే.నగేష్, ఉపాధ్యక్షులుగా సీ.వివేకానంద, కార్యదర్శిగా ఎస్ఆర్.కులశేఖర్, కోశాధికారిగా జే.జయకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వెంకటేష్‌తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

రాంగ్ రూట్ జర్నీలు

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గరుడ వారధిపై తరచూ కొందరు రాంగ్ రూట్ జర్నీలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలతోపాటు, కార్లలో తమ వారిని వదలడానికి వంతెనపై నుంచి బస్టాండ్‌లోకి చేరుకుంటున్నారు. బంధువులు, మిత్రులను వదిలిపెట్టిన తర్వాత అదేమార్గంలో రాంగ్ రూట్‌లో వంతెనపై వెళ్లిపోతున్నారు. ఇటీవల కొన్ని ఆర్టీసీ బస్సులు సైతం రాంగ్ రూట్‌లో వచ్చేస్తున్నాయి. ఇప్పటికే పలుసార్లు చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకున్నా అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.


చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రాథమిక వైద్యం.. రాత్రివేళ దూరం

ఆస్పత్రి అభివృద్ధి కోసం దాతలు వితరణగా ఇచ్చిన ఏసీ కోసం వివాదం తలెత్తింది. అటు జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం.. ఇటు చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మధ్య విభేదాలకు దారి తీసింది. దీంతో సదరు వైద్యాధికారి ఆగమేఘాలపై ఆస్పత్రి డీడీఓ బాధ్యతల నుంచి తప్పుకుంది. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా రాత్రిపూట రోగులకు చికిత్స దూరమైంది.

- చిన్నపాండూరు పీహెచ్‌సీలో ప్రశ్నార్థకంగా సేవలు
- కనీస భద్రత లేదంటూ చేతులెత్తేసిన సిబ్బంది
- ఆస్పత్రిలో తారస్థాయికి చేరిన అంతర్గత విభేధాలు
- డీడీఓ బాధ్యతల నుంచి తప్పుకున్న వైద్యాధికారి
- వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారికి డీడీఓ బాధ్యతలు అప్పగింత
- రాత్రిపూట వైద్యమందక అవస్థలు పడుతున్న స్థానికులు
- వితరణగా వచ్చిన ఏసీ కోసం తలెత్తిన వివాదం

వరదయ్యపాళెం : మండలంలోని చిన్న పాండూరులో రౌండ్ ది క్లాక్ 24 గంటలు స్థాయి కలిగిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ఆస్పత్రికి రూ.2కోట్ల వ్యయంతో అధునాతన వసతులతో కూడిన భవనం నిర్మించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇంతటి వసతులు కలిగిన ఆస్పత్రిలో వైద్యసేవలు అస్తవ్యస్తంగా మారాయి. గ్రామీణ పేద ప్రజల కోసం ఏర్పాటైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారం రోజుల నుంచి రాత్రిపూట వైద్య సేవలు ఆగిపోయాయి. రాత్రివేళల్లో స్టాఫ్ నర్సు ఒక్కరే విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉందని తమకు భద్రత పూర్తిగా కరువైందని, కనీసం అటెండర్ గానీ సెక్యూరిటీ గానీ లేని కారణంగా రాత్రిపూట వైద్యసేవలు చేపట్టలేకపోతున్నామని ఆస్పత్రికి తాళాలు వేసేస్తున్నారు. దీంతో అత్యవసర వైద్యసేవలకు వచ్చేవారు అర్ధరాత్రివేళ ముప్పతిప్పలు పడుతున్నారు. దీంతో స్థానిక ప్రజలు సైతం వైద్యపరంగా ఏ చిన్న సమస్య వచ్చినా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అటు శ్రీసిటీ, ఇటు చిన్న పాండూరు ఏపీఐఐసీ పరిధిలోని అపోలో, హీరో, మరికొన్ని ఇతర పరిశ్రమలు ఏర్పాటుతో అటు స్థానికేతరులు, ఇటు స్థానికులతో రోజువారీ 300 మందికి పైగా ఓపీలో వైద్యసేవలు పొందుతున్నారు. ఈనేపథ్యంలో ఆస్పత్రి స్థాయిని ఇంకొంచెం పెంచాల్సింది పోయి ఉన్న స్థాయిని కాస్త రోజురోజుకు తగ్గించేస్తూ వైద్యసేవలే అందని పరిస్థితులు దాపురిస్తున్నాయి.

మనస్తాపానికి గురై..

ఏసీ వివాదంతో మనస్తాపానికి గురైన పీహెచ్‌సీ వైద్యాధికారి లావణ్య ఏకంగా నాలుగు రోజుల క్రితం డీడీఓ బాధ్యతల నుంచి తప్పుకుంది. తాను కేవలం పీహెచ్‌సీ సమయానికే విధులకు హాజరవుతానని, ఇతర బాధ్యతలను తాను చేపట్టలేనని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారికి రాతపూర్వకంగా విన్నవించింది. దీంతో డీడీఓ బాధ్యతలను వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు చెందిన వైద్యాధికారి ద్వైతకు అప్పగిస్తూ డీఎంహెచ్‌ఓ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె శనివారం చిన్న పాండూరు పీహెచ్‌సీలో డీడీఓగా బాధ్యతలు స్వీకరించింది.

చేతులెత్తేసిన సిబ్బంది

గత కొద్దిరోజులుగా నడుస్తున్న వివాదం నేపథ్యంలో ఇదే అదునుగా భావించిన ఆస్పత్రి సిబ్బంది ఏకంగా రాత్రిపూట వైద్యసేవలు తాము నిర్వహించలేమంటూ చేతులెత్తేశారు. చిన్న పాండూరులో 40ఏళ్ల క్రితం 24 గంటలు స్థాయి (రౌండ్ ది క్లాక్) కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటైంది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా రాత్రిపూట వైద్యసేవలు కొనసాగుతున్నాయి. అయితే తాజాగా స్టాఫ్ నర్సులు తాము ఒంటరిగా విధులు నిర్వహించడం ఇబ్బందికరంగా ఉందని, కనీసం ఒక అటెండర్, సెక్యూరిటీ గార్డ్ ఉంటే గానీ తాము రాత్రివేళల్లో పనిచేయలేమని తేల్చి చెబుతున్నారు.

ఏసీ వివాదంతో..

ఇటీవల శ్రీసిటీకి చెందిన ఓ పరిశ్రమ సీఎస్ఆర్ ద్వారా ఆస్పత్రి అభివృద్ధి కోసం కొన్ని పరికరాలు, ఏసీలు వితరణగా అందజేసింది. అయితే ఆ ఏసీపై తిరుపతి జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం వారి కన్నుపడింది. దీంతో ఆస్పత్రికి వితరణగా వచ్చిన ఏసీని జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపాలని ఓ అధికారి చిన్న పాండూరు పీహెచ్‌సీ డాక్టర్ లావణ్యను కోరారు. అయితే దాతలు వితరణగా అందించిన ఏసీని ఇచ్చేందుకు ఆమె నిరాకరించారు. రాతపూర్వకంగా ఒక లెటర్‌ను రాసి ఆస్పత్రికి అందజేసి ఏసీని తీసుకోవల్సిందిగా తేల్చి చెప్పారు. దీంతో ఇరువురి మధ్య వివాదం తారస్థాయికి చేరింది.

అత్యవసర పరిస్థితుల్లోనూ అందని సేవలు

తాజాగా శుక్రవారం రాత్రి యానాదివెట్టు దళితవాడకు చెందిన మల్లికార్జున (43) రాత్రి 11 గంటల సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై చిన్న పాండూరు ఆస్పత్రికి వచ్చాడు. అక్కడ ఆస్పత్రికి తాళం వేసి ఉండడంతో తీవ్రమైన రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇలా అనేక మంది రాత్రివేళల్లో వైద్యం కోసం చిన్న పాండూరు ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పీహెచ్‌సీలో రాత్రివేళ వైద్యసేవలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నాగలాపురం : ల్యాప్‌టాప్‌ను చోరీ చేసిన కేసులో బైటికోడియంబేడుకు చెందిన నిందితుడు సలీమ్(20)ను శనివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. 2024 మే 25వ తేదీన చెన్నై నుంచి కర్నూలుకు వెళుతున్న బస్సులో ఓ విద్యార్థి నుంచి నిందితుడు రూ.1.9లక్షల విలువైన ల్యాప్‌టాప్, రూ.25వేల ఆపిల్ ఇయర్ ఫోన్‌ను అపహరించినట్లు వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని వివరించారు.

తుమ్మలగుంటలో కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య


భాస్కరయ్య (ఫైల్)

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట గ్రామంలో నివాసముంటున్న టీ.భాస్కరయ్య (65) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... మృతుడు తిరుపతి ఎస్వీ గోశాలలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తన ఇంటి మిద్దెపైన మొదటి అంతస్తులో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా కుటుంబీకులు గుర్తించి చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈదురుగాలులు.. గాల్లో విమానం చక్కర్లు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఈదురు గాలుల వల్ల వాతావరణం అనుకూలించకపోవడంతో రేణిగుంట విమానాశ్రయంలో దిగాల్సిన ఇండిగో విమానం ల్యాండింగ్ కాకుండా గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఆపై చెన్నై విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లింది. హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి ఆదివారం రాత్రి 8.40కి ఇండిగో విమానం చేరుకోవాలి. అయితే ఈదురు గాలులతో వాతావరణం అనుకూలించకపోవడంతో విమానాశ్రయం నుంచి ల్యాండింగ్ క్లియరెన్స్ రాలేదు. దీంతో విమానం రేణిగుంట-ఏర్పేడు పరిసర ప్రాంతాల్లోనే దాదాపు అరగంట పాటు గాల్లో చక్కర్లు కొట్టింది. ఎంతసేపటికీ వాతావరణం సానుకూలంగా లేకపోవడంతో చెన్నై విమానాశ్రయానికి చేరుకుంది. ప్రయాణికులు భయాందోళనకు లోనయ్యారు. వాతావరణం అనుకూలించిన వెంటనే చెన్నై నుంచి రేణిగుంట విమానాశ్రయానికి విమానం చేరుకుంటుందని అధికారులు తెలిపారు.


గూగుల్ మ్యాప్‌లో విమానం చక్కర్లు కొట్టిన చిత్రం

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట కడప రైల్వే మార్గంలోని రైల్వే కోడూరు సమీపంలో ఉప్పరపల్లి రైల్వే గేటు వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందాడు. అతనికి సుమారు 25 ఏళ్లు ఉంటాయని, మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. ఎవరైనా అతని ఆచూకీ గుర్తిస్తే రేణిగుంట పోలీసులను సంప్రదించాలని సూచించారు. 9885753379, 9963126343 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

టీటీడీ చైర్మన్‌గా భూమన సేవలు అద్వితీయం

- ఏ తప్పూ చేయలేదని ప్రమాణం చేసిన దమ్మున్న నాయకుడు
- భూమనను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే నానికి లేదు : మోహిత్‌రెడ్డి


మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: హైందవ ధర్మ పరిరక్షణకు టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకరరెడ్డి చేసిన సేవలు అద్వితీయమని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో కలసి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తిరుపతిలోని ఎస్వీ గోశాలను సందర్శించినప్పుడు భూమనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హైందవ సంస్కృతి, సనాతన ధర్మం గురించి కరుణాకరరెడ్డికి తెలిసినంతగా ఎవరికీ తెలియదని స్పష్టం చేశారు. సనాత ధర్మంపై ఎంతో గొప్ప పరిజ్ఞానం కలిగిన ఆయనను, నిత్యం అబద్ధాలతో పబ్బం గడుపుకునే ఎమ్మెల్యే నాని విమర్శిస్తే ప్రజలు నవ్వుతారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో తొలిసారిగా టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన భూమన సనాతన ధర్మ రక్షణకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. అందులో ప్రధానంగా దళిత గోవిందం, మత్స్యగోవిందం, కల్యాణమస్తు, గోవింద కోటి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రజల ముందుకు తెచ్చారని వివరించారు. స్వామి చెంతకు రాలేని వారందరికోసం సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుడినే దళితవాడలకు తీసుకువెళ్లి పూజలు చేయించిన గొప్ప మనిషి భూమన అని తెలిపారు. మత్స్యకారులకు వైదిక కర్మల్లో శిక్షణ ఇప్పించి, సర్వమానవ సమానత్వాన్ని చాటారన్నారు. కల్యాణమస్తు ద్వారా బంగారపు తాళిబొట్టు, వెండి మట్టెలు, వధూవరులకు నూతన వస్త్రాలు, తలంబ్రాలు, పెళ్లి సామగ్రి, మంగళ వాయిద్యాలు, ధార్మిక స్తోత్ర పుస్తకాలు, పురోహితుడు, 60 మంది బంధుమిత్రులకు పెళ్లి భోజనాలు ఉచితంగా కల్పించారని వివరించారు. గోవింద కోటి ద్వారా భక్తులకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించి ప్రజల్లో భక్తితత్వాన్ని పెంపొందించారని వెల్లడించారు. తిరుమలకు వచ్చి శ్రీవారిని చూడలేని ఎంతో మంది సామాన్య భక్తులకు ఆలయంలో జరిగే ఆర్జిత సేవలు, దైనందిన పూజలు, టీటీడీ నిర్వహించే ధార్మిక కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేకంగా ఎస్వీబీసీ చానల్ ప్రారంభించిన ఘనత భూమనకే దక్కుతుందని వెల్లడించారు. తిరుమలతో పాటు తిరుపతిలో కూడా ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం కలిగిస్తూ నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ''ఓం నమో వేంకటేశాయ'' అన్న మంత్రాన్ని వినిపించేలా చేశారన్నారు. తిరుమల శ్రీవారి దర్శనంలో తిరుపతి వాసులకు ప్రాధాన్యత కల్పించేలా స్థానికులకు ప్రత్యేకంగా వారంలో ఒక రోజు దర్శనం చేసుకునే అదృష్టం కల్పించారని వివరించారు. శ్రీవారి సేవలో నిత్యం తలమునకలైన టీటీడీ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని అమలు చేసిన శక్తి, సామర్థ్యం భూమన కరుణాకర రెడ్డికి మాత్రమే సొంతమని తెలిపారు. ముఖ్యమంత్రులుగా వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో టీటీడీ చైర్మన్‌గా తిరుమల ఆలయ ప్రతిష్టను పెంచేలా గొప్ప సంస్కరణలను తీసుకువచ్చారని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుట్రపూరితంగా నింద వేయడంతో ఆయన తిరుమలకు వెళ్లి సాక్షాత్తు ఆ దేవ దేవుని ముందు తడిబట్టలతో నిలబడి తాను తప్పు చేయలేదని ప్రమాణం చేసిన దమ్మున్న నాయకుడని స్పష్టం చేశారు. అలాంటి తమ నాయకుడి గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యే నానికి లేదని తెలిపారు.



కిడ్నాప్ కేసులో కొత్త కోణం!

- ఇద్దరు నిందితులకు ముగిసిన కస్టడీ

తిరుపతి క్రైమ్ : నగరంలో పది రోజులకు ముందు జరిగిన కిడ్నాప్ కేసులో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. రాజేష్ కుటుంబీకులను కిడ్నాప్ చేసిన ఆరుగురు నిందితులను అలిపిరి పోలీసులు నాలుగు రోజులు ముందు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం కోర్టు అనుమతితో వీరిని రెండు రోజులపాటు పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆసక్తికర వాస్తవాలను నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో ప్రధాన ముద్దాయిలైన అరుణ్ కుమార్, భార్గవ్ తమ పేర్లపైన కొత్త కంపెనీలు ప్రారంభించారన్నారు. ఇలా కొత్త కంపెనీలు ప్రారంభించి ట్రేడింగ్ చేస్తామని జనాలను నమ్మించినట్లు వెల్లడించారు. చాలమందికి వారి అకౌంట్లోనే పర్సనల్ లోన్లు ఇప్పించారి, ఆ లోన్ డబ్బులను తమ వద్ద ఇన్‌వెస్ట్ చేస్తే అధిక డబ్బులు వస్తాయని చెప్పారన్నారు. అనంతరం ఆ డబ్బులు ఉపయోగించుకొని జనాలను మోసం చేశారని చెప్పారు. అయితే ఈ కేసుకు సంబంధించి ఎంతమంది మోసపోయారు అన్నది ఇంకా పూర్తిస్థాయిలో విచారించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులకు కస్టడీ ముగియడంతో ఆదివారం వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు వెల్లడించారు. మరోసారి కస్టడీకి తీసుకుని పూర్తి విషయాలను రాబడతామన్నారు. అంతేకాకుండా కిడ్నాప్ అయిన వారికి మత్తు ఇంజెక్షన్లు వేసేందుకు కూడా మీరు సిద్ధమైనట్లు వివరించారు. నిందితుల నుంచి ఆపరేషన్ థియేటర్లో ఉపయోగించే అనస్తీషియా మత్తు ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలు

- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించిన ఎస్పీ


డ్రోన్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్ : మ్యాట్రిస్ థర్మల్ డ్రోన్ కెమెరాలను ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదివారం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటి పనితీరును పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. బహిరంగ ప్రదేశాలు, అగ్నిప్రమాద స్థలాలు, అటవీ ప్రాంతాల పరిశీలనకు వాడుకోవచ్చని చెప్పారు. ఇందుకోసం మొత్తం నాలుగు డ్రోన్లను తీసుకువచ్చామన్నారు. ఇందులోని ఒక డ్రోన్‌లో అడ్వాన్స్‌డ్ కెమెరా ఉందని వెల్లడించారు. సుమారు ఒక కిలోమీటర్ ఎత్తు వరకు ఎగిరి పరిసరాల దృశ్యాలను పూర్తిస్థాయిలో అందిస్తాయని తెలిపారు. రాత్రి వేళల్లో కూడా ఏఐ టెక్నాలజీ ద్వారా పూర్తిస్థాయిలో ఉపయోగపడతాయన్నారు. ఫైర్ యాక్సిడెంట్ జరిగినప్పుడు జనాలను కాపాడేందుకు వినియోగించుకోవచ్చని వెల్లడించారు. వీటిని వాడేందుకు 40 మంది పోలీసులకు ట్రైనింగ్ ఇచ్చామన్నారు. ఇందులో 20 మంది సివిల్ కానిస్టేబుళ్లు 20 మంది ఏఆర్ సిబ్బంది ఉన్నారని వివరించారు.

ప్రగతి వివరాలు

జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది విధులను పెంచి నేరాలను కట్టడి చేసినట్లు జిఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. మార్చి నుంచి ఇప్పటివరకు సాధించిన ప్రగతి పురోగతిని తెలిపారు. ఆయన మాటల్లోనే..

- గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశాం. సుమారు 119.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. 11 కేసులు నమోదు చేశాం.
- బహిరంగంగా మద్యం సేవించే 3,145 ప్రదేశాలను గుర్తించాం. వాటిని శుభ్రం చేయించాం. ఈ క్రమంలోనే 32 మంది మందుబాబులకు జరిమానా విధించాం.
- జిల్లావ్యాప్తంగా పోలీసులు ఆధ్వర్యంలో 223 పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టాం.
- రాంగ్ రూట్లో వచ్చే వాహనాలపై కఠినమైన చర్యలు తీసుకున్నాం. 359 కేసులు నమోదు చేశాం. ఇప్పటివరకు రూ.12.40 లక్షల జరిమానా వసూలు చేశాం.

ముక్కంటి ఆలయంలో ముగ్గురికి మెమోలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ముగ్గురు ఉద్యోగులకు ఈఓ బాపిరెడ్డి మెమోలు జారీ చేశారు. అనుమతి లేకుండా ప్రోటోకాల్ దర్శనం కల్పించిన క్రమంలో చర్యలు చేపట్టినట్లు మెమోలో పేర్కొన్నారు. వివరాలు.. శనివారం బీజేపీ నేత, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ ఓ వ్యాపారిని ముక్కంటి దర్శనానికి తీసుకువచ్చారు. ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్, మరో ఇద్దరు ఉద్యోగులు దక్షిణ గోపురం వద్ద పూలమాల వేసి స్వాగతం పలికారు. ప్రొటోకాల్ మర్యాదలు పాటిస్తూ దర్శనం చేయించారు. ఈ విషయం తెలియడంతో ఈఓ బాపిరెడ్డి మండిపడ్డారు. తనకు తెలియకుండా, ముందస్తు సమాచారం లేకుండా ప్రైవేటు వ్యక్తులకు ఎలా ప్రోటోకాల్ దర్శనం ఏర్పాటు చేస్తారంటూ ఆ ఉద్యోగులకు ఆలయ ఈవో బాపిరెడ్డి మెమోలు ఇచ్చారు.

ఆధిపత్య పోరుతో సతమతం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూటమి నేతల ఆధిపత్య పోరుతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. వారు చెప్పిన వారికి దర్శనం చేయిస్తే ఒక బాధ, దర్శనం చేయించుకుంటే మరో బాధ అన్నట్టుగా నలిగిపోతున్నారు. పైకి నేతలందరూ బాగానే ఉంటారు కానీ, ఇలాంటి సమయాల్లో తాము బలవుతున్నామని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. పది రోజుల క్రితం ఆలయంలో దళారులను అడ్డుకుంటున్నారని, కూటమి నేతలను సైతం దర్శన టికెట్టు తీసుకోమంటున్నారని ఏఈవో లోకేష్ రెడ్డిని వేరే విధులకు బదిలీ చేసినట్టు ఆలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

బాలాయపల్లి (సైదాపురం) : బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బాలాయపల్లె ఎస్ఐ గోపి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మల్లెమాల దళితవాడకు చెందిన పోలయ్య అనే యువకుడు ఓ బాలికను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడన్నారు. బాలిక గర్భిణి కావడంతో ముఖం చాటేసినట్లు వెల్లడించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని, ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఆకట్టుకుంటున్న మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో


ఎక్స్‌పోలో సీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతినిధులు


సాంబ్రామ్ ఇన్‌స్టిట్యూట్ స్టాల్ వద్ద కోర్సులపై ఆరా తీస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


రేవా యూనివర్సిటీ ఎక్స్‌పోలో నిపుణుల సలహాలు తీసుకుంటున్న తల్లిదండ్రులు


ఎక్స్‌పోలో రామయ్య వర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: స్థానిక ఆర్టీసీ ఓవర్ బ్రిడ్జి సమీపంలోని చింతలచేను శ్రీరామ తులసి కళ్యాణ మండపం వేదికగా విద్యాస్ఫూర్తి పేరుతో ప్రముఖ యాడ్ 6 అడ్వర్‌టైజింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రెండు రోజుల మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో - 2025 ప్రారంభమైంది. ఇందులో నగర ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలి రోజు బెంగళూరు మార్తనహల్లిలోని హిందుస్తాన్ ఏవియేషన్ అకాడమీ, జాలహల్లి ఈస్ట్‌లోని సంబ్రమ్ ఇన్‌స్టిట్యూట్, కృష్ణరాజపురంలోని ఎస్ఈఏ(సీ) ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, విద్యారంగ నిపుణులు పాల్గొని అడ్మిషన్ల ప్రక్రియ, ఫీజుల వివరాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా అందించే కోర్సులు, అంతర్జాతీయ కోర్సులపై అవగాహన కల్పించారు. నిర్వాహకులు రఘుకిషోర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పోకు ఊహించని రీతిలో స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. బెంగళూరు లాంటి సిటీలో విద్యనభ్యసించి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలనే విద్యార్థులకు ఇది సరైన వేదికని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు